క్లుప్తంగా

సారా విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. దుర్గసముద్రం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన జె.గంగాధరం సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అతని ఇంట్లో తనిఖీ చేశామన్నారు. 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామన్నారు. పుంగనూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

దారి సమస్యను పరిష్కరించాలని వినతి



అర్జీ సమర్పించడానికి వచ్చిన గంటావూరు రైతులు

పలమనేరు: పొలాల వద్దకు వెళ్లే దారిలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గంటావూరుకు చెందిన రైతులు వాపోయారు. వారు సోమవారం స్పందనలో ఆర్‌డీవో కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతుల పంట పొలాలకు వెళ్లే దారి రెవెన్యూ రికార్డుల్లోనూ ఉందన్నారు. దాన్ని ఇళ్ల పట్టాలు, ఇతర ప్రభుత్వ భవనాలకు కేటాయించినట్టు తెలిసిందన్నారు. దీనిపై విచారణ చేసి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు. దైవప్రసాద్, గోవిందురాజులు, మురళి, రమేష్, వరదరాజులు, చంద్ర, ప్రభాకర్, గోపి పాల్గొన్నారు.

పరామర్శ



మురుగేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు

శాంతిపురం: ఇటీవల రాళ్లబూదుగూరు సబ్‌స్టేషన్‌లో కరెంటు షాక్‌తో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గొల్లపల్లికి చెందిన మురుగేష్ (24)ను ఎమ్మెల్సీ భరత్ పరామర్శించారు. సోమవారం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్పతో కలిసి కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో బాధితుడి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రవీణ్ మాతృమూర్తి గ్రేస్ విమలమ్మ ఆదివారం మృతి చెందింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి సోమవారం పెద్దపంజాణికి చేరుకుని గ్రేస్ విమలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రణాళికతోనే మంచి మార్కులు

రొంపిచెర్ల: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి అన్నారు. సోమవారం రాత్రి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువుతున్నారా? లేదా అని తనిఖీ చేశారు. విద్యార్థులు రాత్రి 10 గంటల వరకు, ఉదయం 5 నుంచి 7 గంటల వరకు చదివేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.

పకడ్బందీగా రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి

సోమల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. సోమవారం వీఆర్‌ఓలతో సమీక్షించారు. రైతుల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సర్వేయర్ ద్వారకనాథ్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

సోమల: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి నీటి ఎద్దడి ఉన్న చోట ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

చిత్తూరు మున్సిపల్ ఆర్‌ఓగా గోపాలకృష్ణవర్మ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి (ఆర్‌ఓ)గా గోపాలకృష్ణవర్మను నియమిస్తూ కమిషనర్ అరుణ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న వర్మను రెవెన్యూ అధికారిగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కమిషనర్ ఆస్తి పన్ను పుస్తకాలు సీజ్ చేసిన విషయం తెలిసిందే.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- నేలకూలుతున్న పచ్చటి చెట్లు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- వాల్టా చట్టం అమలులో మీనమేషాలు

పలమనేరు నియోజకవర్గంలో కొందరు అక్రమార్కులు గట్టుచప్పుడు వృక్షాలను నరికి కలపను సామిల్లులు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ప్రభుత్వభూములు, ఆలయ మాన్యాల్లోని వృక్షాలను సైతం వదలడం లేదు. ఇందులో నలుగురు దాన్లు 40 మందిని ఏర్పాటుచేసుకుని చెట్లను నరికి తరలించడమే వృత్తిగా చేసుకున్నట్టు సమాచారం. వాల్టా చట్టాన్ని అమలుచేయడంలో అటవీ, రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. –పలమనేరు



తరలించేందుకు ట్రాక్టరులో సిద్ధం చేసిన కలప (ఫైల్)

పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, పొరంబోకు భూములతో పాటు రైతుల పంట పొలాల్లో వృక్షాలు భారీగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో జనవరి నుంచి మే నెల వరకు ఇటుకబట్టీల సీజన్ ఉంటుంది. బట్టీల్లో ఇటుకలను కాల్చేందుకు కలప అవసరం కావడంతో స్థానికంగా మంచి డిమాండ్ ఉంది. దీనికి తోడు మండల కేంద్రాల్లోని సామిల్లుల్లో సీజన్‌తో సంబంధం లేకుండా కలపను కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది కలప వ్యాపారమే వృత్తిగా చేసుకుని చెట్లను రహస్యంగా నరికించి రాత్రికి రాత్రే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 40 మంది ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నట్టు సమాచారం. వీరిలో నలుగురు ఆయా మండలాల్లో చెట్లను కొట్టి

నియోజకవర్గంలో ఇటుక బట్టీలు	
ఇటుక బట్టీలు	: 300 దాకా
బట్టీకి అవసరమయ్యే కలప	: 35 టన్నులు
టన్ను కలప ధర	: రూ.12 వేలు
సీజన్‌లో కాలి బూడిదవుతున్న కలప	: 12,600 టన్నులు

వ్యాపారం చేసే డాన్లుని తెలిసింది. పలమనేరు మండలంలో కొలమాసనపల్లి పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి కలప అక్రమ రవాణాలో ఆరితేరినట్టు సమాచారం. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా వీకోటకు చెందిన ఒక వ్యాపారి సామిల్లుకు కలప చేరుతున్నట్టు తెలిసింది.

వాల్టా చట్టం అమలేది

చెట్లను నరకకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏపీ వాల్టా యాక్టు 2002 (ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్టు)ను అమలు చేస్తోంది. దీని ప్రకారం ఎవరైనా రైతులు పట్టా భూముల్లోని చెట్లను నరకాలన్నా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. అలాగే వాటి స్థానంలో అంతకుమించి మొక్కలు నాటాలి. దీని గురించి సంబంధిత రెవెన్యూ గ్రామాల వీఆర్వోలు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్ అధికారులు పటిష్టంగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రూ.లక్షల విలువైన కలప అక్రమంగా తరలిపోతోంది. ఈ విషయమై స్థానిక ఎఫ్ఆర్‌వో నయీమ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిన సంఘటనలపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధిస్తున్నామన్నారు. కలప అక్రమ రవాణాపై తమ సిబ్బందితో నిఘా పెట్టి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా కలపను తరలిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సేవతో ప్రజల మనసులు గెలుద్దాం



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన మార్గంలో ప్రజలకు మంచి చేస్తూ వారి మనసులను గెలిచేలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పార్టీకి 10 నిమిషాలు కేటాయించి తమ పరిధిలోని కుటుంబాలతో మాట్లాడాలని కోరారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించాలని, సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలతో పొందిన లబ్ధిని గత ప్రభుత్వ పాలనతో పోల్చి వివరించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక మార్చి 17వ తేదీ తర్వాత 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. యజమాని అంగీకరించే ప్రతి ఇంటికీ, మొబైల్ ఫోనుకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను వేయాలన్నారు.

బాబు మోసాలను వివరిద్దాం

కుప్పం ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలవడం వల్లే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగలిగారని భరత్ గుర్తు చేశారు. దీని వల్లే ఆయన కొడుకును దొడ్డిదారిన మంత్రిగా చేశారని అన్నారు. కుప్పం ప్రజలను ఓట్లుగా చూస్తూ వారి బాగోగులు పట్టించుకోలేదని విమర్శించారు. కరోనా సమయంలో ప్రభుత్వం, తాను, వైఎస్సార్ సీపీ నాయకులు జనానికి మద్దతుగా నిలిచామని గుర్తు చేశారు. జపాన్, సింగపూర్ అంటూ ఎన్నికల సమయంలో కుప్పాన్ని ఒక దేశంలాగా అభివృద్ధి చేస్తానని బాబు ప్రజలను ఏమార్చారని అన్నారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, కార్పొరేషన్ డైరెక్టర్లు చంగప్ప, పెద్దన్న, కృష్ణమూర్తి, సుకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రామకుప్పం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. రామకుప్పంలోని ఓ కల్యాణ మండపంలో మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు కరోనా కష్టకాలంలో కుప్పం వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. హైదరాబాద్‌కే పరిమితం అయ్యారన్నారు. స్థానిక వైద్యాధికారులతో కనీసం సమీక్షించని ఆయనకు ఎన్నికల సమయంలో కుప్పం ప్రజలు గుర్తుకురావడం స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈసారి చంద్రబాబునాయుడుకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన, ప్రస్తుత ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వ్యత్యాసాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డప్ప, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్పగౌడు, రెస్కో డైరెక్టర్లు నాగిరెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియ పరిశీలన



పెద్దపంజాణి: మండలంలోని కొలత్తూరులో జరుగుతున్న ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియను సోమవారం ఎంపీడీఓ టి.శ్రీనివాస్ విశ్వనాథ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. తద్వారా అనేక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శివశంకర్, వలంటీర్ శిల్పావతి పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు



పనులను పరిశీలిస్తున్న మురళీకృష్ణారెడ్డి

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. ఇక్కడ రూ. 3 కోట్ల వ్యయంతో 28 గదులను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 7 గదులు శ్లాబ్ దశను పూర్తి చేసుకున్నాయి. మరో 14 గదులకు శ్లాబ్ పనులు వారం రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాని కాంట్రాక్టరుకు సూచించారు. పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పాలమంద సర్పంచ్ మనోహర్‌రెడ్డి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణమ్మ

పులిచెర్ల(కల్లూరు): జగనన్న ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సుగుణమ్మ అన్నారు. మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, ఇనుకులవారిపల్లెల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. అనంతరం కల్లూరు పంచాయతీ కార్యాలయంలో అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ

సదుం: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ విజయేంద్రరావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశ ప్రణాళిక డైరీని పరిశీలించారు. విద్యార్థుల సమ్మేటివ్ పరీక్ష ఫలితాలు, గ్రేడింగ్ రిజిస్టర్, ఉపాధ్యాయుల సెలవులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సెలవు పెట్టే ప్రతి ఉపాధ్యాయుని వివరాలు, కారణం తనకు మధ్యాహ్నం 12లోపు తెలియజేయాలని ఆదేశించారు. సదుం, చిత్తూరు ఎంఈఓలు శ్రీరాములు, సెల్వరాజ్, ఎస్టీయూ నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధి నిరోధక శక్తి



షికారికాలనీ వాసులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: పిల్లలకు టీకాలు వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. పట్రపల్లి సచివాలయంలో సోమవారం షికారీకాలనీలోని గ్రామస్తులకు పిల్లలకు టీకాలు వేయించడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ షికారీ కాలనీ వాసులు తమ పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయించకపోవడంతో రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ పట్రపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



తవణంపల్లె: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లోకేశ్వరి అన్నారు. అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, బ్రహ్మకుమారీస్ భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్, కల్ప తరూష్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కల్పతరూష్ మొబైల్ యాప్ ప్రయోజనాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి శోభారాణి, బ్రహ్మకుమారీస్ ఫౌండేషన్ సభ్యులు వీణా, దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంచార పశువైద్య వాహనం ప్రారంభం



శాంతిపురం: మండలానికి మంజూరైన డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనాన్ని రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల వైద్య సేవల కోసం పాడిరైతులు 1962 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకేశ్వరరావు, పశువైద్యాధికారి చాహతుల్లా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



వి.కోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించండి
- ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దిశానిర్దేశం
- కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

గంగవరం/వి.కోట: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైనికుల్లా పనిచేసి వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గంగవరంలోని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్, వి.కోటలోని ఏకే కల్యాణ మండపంలో సోమవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. మూడున్నరేళ్లలో చేసిన మంచి పనులు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లాలని, వారు పొందిన లబ్ధిని వివరించాలని సూచించారు. గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి గతంలోకంటే ఈ ప్రభుత్వం మేలు జరిగిందా లేదా అన్న విషయాలను ప్రజలకు వివరించి వారు ఇచ్చే సమాచారాన్ని బుక్‌లో టిక్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మార్చి 15 నుంచి 25 వరకూ చేపట్టనున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా గెలిచి జగన్‌కు వెన్నుపోటు పొడిచి తిరిగి మంత్రి పదవి పొందిన వ్యక్తి ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని తెలిపారు. చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయడానికి దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ తపన, ఆరాటం జన సైనికులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఇద్దరినీ బంగాళాఖాతంలో కలిపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం ఎంపీపీ వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లద, జెడ్పీటీసీ పార్వతి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ ఆదాంబాష, సచివాలయాల మండల కన్వీనర్ వినోద్‌రెడ్డి, వి.కోట ఎంపీపీ యువరాజు, జెడ్పీ చైర్మన్ ప్రత్యేక సలహాదారుడు ఎస్ఏగౌస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, లక్ష్మన్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కిషోర్, ఉపసర్పంచ్ అక్మల్, నాయకులు ధవనం భక్త, భూపతి, కుమార్‌రాజా, శశికళ, పూలనాగ, ఆంజనేయులు, సయ్యద్ షామీర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ

పులిచెర్ల(కల్లూరు): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళంపేట యూత్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా సోమవారం బహుమతులు అందజేశారు. మొత్తం 20 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఎల్లోఫైటర్స్ జట్టుపై వడ్డిపల్లె టీం విజయం సాధించింది. మొదటి బహుమతి రూ.15,116, రెండో బహుమతి రూ. 8,116ను అందజేశారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ముర్వత్ బాషా, ప్రసాద్, సర్పంచ్ మధు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ అశోక్‌కుమార్

బైరెడ్డిపల్లె: మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో సోమవారం అమరనాథ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి 3360 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైరెడ్డిపల్లె పరిసరాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నట్లు సమాచారం ఉందని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి గ్రామంలోనూ పోలీస్ నిఘా ఉందని, ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. ఎస్ఐ వెంకటనరశింహులు, ఏఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవం.. అగస్త్యేశ్వరుని రథోత్సవం





స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

పుంగనూరు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెక్కుంది కొండపై వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అలంకరించి రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు రథంపై ఉప్పు, మిరియాలు, బొరుగులు, అరటిపండ్లు, నవ ధాన్యాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణరెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. పుంగనూరు, చౌడేపల్లె నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి



పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

కుప్పం: పాలిటెక్నిక్ కోర్సులతో విద్యార్థులకు త్వరగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయని కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పాలిసెట్-2023పై అవగాహన కల్పించారు. డిప్లమా కోర్సులతో ఉజ్వల భవిష్యత్తుకు పునాది అవుతుందని తెలిపారు. మే 10 తేదీ పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఏప్రిల్ 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్మశాన కొల్ల



కుప్పం: మున్సిపల్ పరిధిలోని శ్మశానవాటికలో సోమవారం శ్మశాన కొల్ల పూజలు నిర్వహించారు. ఏటా కొత్తపేటలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో అమావాస్య రోజున శ్మశానంలో పూజలు చేయడం ఆనవాయితీ. కొత్తపేటలోని అమ్మవారిని ఆలయం నుంచి డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్మశానానికి తీసుకొచ్చారు. అమ్మవారి ప్రతిమకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే గంగాపురంలో శ్మశాన కొల్ల పూజలు జరిగాయి.



శ్మశానంలో అమ్మవారి ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న భక్తులు